E69 NEWS

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో
పని చేయుటకు నియోజకవర్గాలవారీగా
విలేకరులు కావలెను వాట్సాప్ నెం:
9959812941-9949356387

PUBLISHED: JANGAON,HYDERABAD సంపుటి :01 సంచిక :187 మంగళవారం 16 జూన్ 2026 ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్ పేజీలు: 04 వెల :05/-

# తెలంగాణలో డిజిటల్ పాలన

## ఈ-కేబినెట్‌కు గ్రీన్ సిగ్నల్!

- పేపర్‌లెస్ పాలనకు వేగం
- ట్యాబ్‌లతోనే మంత్రివర్గ సమావేశాలు
- ఫైళ్లకు గుడ్‌బై.. డిజిటల్‌కు వెల్‌కమ్
- కేబినెట్ అజెండా ఇక ఆన్‌లైన్‌లోనే
- రహస్య సమాచారానికి పటిష్ట భద్రత
- పారదర్శక పాలనకు మరో అడుగు
- కాగితాల ఖర్చుకు చెక్
- స్మార్ట్ గవర్నెన్స్ వైపు తెలంగాణ
- ప్రతి నిర్ణయం డిజిటల్ రికార్డు
- ఈ-గవర్నెన్స్‌లో తెలంగాణ దూకుడు
- సీఎస్ సమీక్షతో ఏర్పాట్లు వేగవంతం
- డిజిటల్ కేబినెట్‌కు సర్వం సిద్ధం




**న్యూస్ డెస్క్,15 జూన్ (తెలుగు గళం):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పాలనా విభాగంలో సరికొత్త డిజిటల్ విప్లవానికి తెరలేవనుంది. రాష్ట్ర కేబినెట్ సమావేశాలను ఇకపై పూర్తి స్థాయిలో ఎలక్ట్రానిక్ విధానంలో నిర్వహించేందుకు ప్రభుత్వం సర్వం సిద్ధం చేస్తోంది. పరిపాలనా రంగాన్ని ఆధునీకరించడంతో పాటు, ప్రభుత్వ సమాచార మార్పిడిలో వేగం, పారదర్శకతను తీసుకురావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. ఇందులో భాగంగానే సచివాలయం, వివిధ డైరెక్టరేట్లు, కమిషనరేట్ కార్యాలయాలతో పాటు అన్ని ప్రభుత్వ విభాగాల్లో విడతల వారీగా పేపర్‌లెస్ విధానాన్ని పకడ్బందీగా అమలు చేయాలని సీఎం అధికారులకు గతంలోనే సూచించారు. ఈ నేపథ్యంలో మంత్రివర్గ సమావేశాలను సైతం డిజిటలైజ్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

ఈ సరికొత్త విధానం అమల్లోకి వస్తే.. కేబినెట్ సమావేశాల్లో మంత్రుల ముందు ఎలాంటి ఫైళ్లు, కాగితపు పత్రాలు కనిపించవు. వీటికి బదులుగా మంత్రులందరికీ అత్యాధునిక ట్యాబ్‌లను అందజేయనున్నారు. ఈ ట్యాబ్‌లకు అవసరమైన ప్రత్యేక సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ సదుపాయాలను సమకూర్చే పనిలో ఐటీ, సాధారణ పరిపాలన శాఖ అధికారులు నిమగ్నమయ్యారు. ఈ ప్రాజెక్ట్ కోసం కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన నేషనల్ ఇన్‌ఫర్మాటిక్స్ సెంటర్ రూపొందించిన అత్యంత సురక్షితమైన సాఫ్ట్‌వేర్‌ను రాష్ట్ర ప్రభుత్వం వినియోగిస్తోంది.

మిగతాది 2 లో..

# తీవ్ర సంక్షోభం.. ఆదుకోండి

## చంద్రబాబుకు బీజేపీ స్టేట్ అధ్యక్షుడి లేఖ




**న్యూస్ డెస్క్,15 జూన్ (తెలుగు గళం):** చిత్తూరు జిల్లాలో మామిడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దిగుమతి భారీగా వచ్చిన పంటకు సరైన రేటు లేకపోవడంతో నష్టపోతున్నారు. దీంతో వారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు. చిత్తూరు జిల్లా పర్యటనకు వెళ్తున్న ప్రతి పార్టీ నాయకులకు తమ పరిస్థితిని విన్నవించుకుంటున్నారు.తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరుకుంటున్నారు. ఇలా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎస్ మాధవ్ దృష్టికి వచ్చింది. దీంతో ఆయన స్పందించారు.

# నేడు ఇందిరా గాంధీ బ్రతికి ఉంటే బీజేపీని బ్యాన్ చేసేవారు: మాజీ సీఎం అశోక్ గెహ్లాట్




**న్యూస్ డెస్క్,15 జూన్ (తెలుగు గళం):** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ బీజేపీ పార్టీపై సంచలన వ్యాఖ్యలు చేశారు. జైపూర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో అశోక్ గెహ్లాట్.. భారతీయ జనతా పార్టీ (బీజేపీ) లక్ష్యంగా సంచలన వ్యాఖ్యలు చేశారు. దేశంలో ప్రస్తుతం ఉనికిలో ఉన్న పరిస్థితులు అత్యంత ప్రమాదకరంగా మారాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

# ఈ నెల 18న తెలంగాణ కేబినెట్ భేటీ!




**న్యూస్ డెస్క్,15 జూన్ (తెలుగు గళం):** ఈ నెల 18న తెలంగాణ కేబినెట్ భేటీ కాబోతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు మంత్రి మండలి సమావేశం జరగనుంది. మెట్రో టేకోవర్?పై సందిగ్ధత ఏర్పడడంతో నెక్స్ట్ ఏం చేయాలన్న అంశంతో పాటు రాష్ట్రంలో నెలకొన్న తాజా పరిణామాలపై ప్రభుత్వం మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకోనుంది. వ్యవసాయం, సాగునీటి ప్రాజెక్టులతో పాటు పలు కీలక అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.

# తెలంగాణ సెక్రటేరియట్ వద్ద పోస్టర్ల కలకలం

## పోలీసుల అదుపులో మహిళ




**న్యూస్ డెస్క్,15 జూన్ (తెలుగు గళం):** తెలంగాణ సెక్రటేరియట్ వద్ద పోస్టర్ల కలకలం రేగింది. ఉచిత పథకాలు వద్దు అంటూ సచివాలయం మీడియా సెంటర్ వద్ద గోడలకు పోస్టర్లు ప్రత్యక్షం అయ్యాయి. ప్రతిపేద వాడికి ఇల్లు, యువతకు ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రమ్య పేరుతో చేతి రాతతో రాసి ఉన్న పోస్టర్లు వెలిశాయి. ‘ మద్యం తాగేవారిని కాదు ఆ మద్యం తయారు చేసే కంపెనీ వారిని పట్టుకోండి. గెలిచేవరకు ఒక మాట గెలిచిన తర్వాత మరో మాట. ఎక్కడో ఇండ్లు ఇచ్చి ఇచ్చామని చెప్పుకోవడం కాదు. అందరికీ ఇచ్చామో లేదో అది చూసుకోండి. సీఎం రేవంత్ రెడ్డి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని చెప్పడం కాదు. తెలంగాణలో ఇల్లు లేని వారు ఉండొద్దు. చదువుకున్నవారికి ఉద్యోగాలు ఇవ్వాలి. నాలుగు కార్లు వేసుకుని తిరగడం కాదు. మీ కాలతో పాదయాత్ర చేయండి అప్పుడే ప్రజల తిప్పలు మీకు అర్థం అవుతుంది.

# కేరళలో నిఫా వైరస్ కల్లోలం.. సరిహద్దుల్లో హై అలర్ట్!




# తెలంగాణ ఓటర్లకు అలర్ట్

## జూన్ 25 నుంచి ఇంటింటి సర్వే..!




**న్యూస్ డెస్క్,15 జూన్ (తెలుగు గళం):** తెలంగాణలో ఈ నెల 25 నుంచి ఓటర్ల ప్రత్యేక ‘సమగ్ర సవరణ సర్వే’ (సర్) జరగనుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు సిద్ధమవుతున్నారు.ఈ నెల 15 నుంచి 24 వరకు మూడు దశలుగా కార్యక్రమాలు చేపట్టనున్నారు. మొదటి దశలో సర్ సర్వే నిర్వహణ అధికారులు బిఎల్‌ఓలకు వారు చేపట్టాల్సిన బాధ్యతలు వంటి కార్యక్రమాలపై ప్రణాళిక రూపొందిస్తారు.

# కాంగ్రెస్ తీరు ఇప్పటికీ మారలేదు

## డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్


**న్యూస్ డెస్క్,15 జూన్ (తెలుగు గళం):** ఢిల్లీ వేదికగా జనసేన అధ్యక్షుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలో ఏర్పాటు చేసిన సేన ప్రస్థానం.. దేశ సమగ్రత కోసం సేనా ప్రస్థానం కార్యక్రమంలో పాల్గొన్న పవన్ కల్యాణ్, తెలంగాణ ఏర్పాటు, కాంగ్రెస్ నేతల తీరుపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ సమగ్రత జనసేన సిద్ధాంతమని, దేశ స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లడమే జనసేన లక్ష్యమని, అందుకే ఢిల్లీలో ఈ సమావేశం ఏర్పాటు చేశామని పవన్ కల్యాణ్ చెప్పుకొచ్చారు.

అలాగే జనసేన పార్టీ ఎప్పుడు తెలంగాణ ఏర్పాటుకు వ్యతిరేకంగా కాదని, విభజన చేసిన తీరుకు తాము వ్యతిరేకమని చెప్పుకొచ్చారు. అలాగే జనసేన పార్టీ సమావేశాన్ని కాంగ్రెస్ పార్టీ అడ్డుకుందని, తమను అడ్డుకునేందుకే ప్రయత్నించిన కాంగ్రెస్ పార్టీ నేతలు తమపై తీవ్ర విమర్శలు చేశారని, నేటికి కూడా కాంగ్రెస్ తీరు మారలేదని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చెప్పుకొచ్చారు. అలాగే సేనా ప్రస్థానం లక్ష్యాలను పార్టీ కార్యకర్థకలకు, నేతలకు వివరించారు. జనసేన పార్టీకి ఎల్లప్పుడూ సొంత ప్రయోజనాల కంటే దేశ సమగ్రత, శ్రేయస్సే అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు. దేశ స్ఫూర్తిని, జాతీయ సమైక్యతను కాపాడుకోవడం అనేది ఒక్కరోజుతో ముగిసే పనికాదని, ప్రతి తరం దీనిని బాధ్యతగా ముందుకు తీసుకెళ్లాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు.



# తెలంగాణ సెక్రటేరియట్ వద్ద పోస్టర్ల కలకలం పోలీసుల అదుపులో మహిళ

మొదటి పేజీ తరువాయి



చేసిన కష్టం ఇంటి కిరాయిలకే:

పల్లెటూర్లో పాదయాత్ర చేసినట్టు కాదు హైదరాబాద్ లో పాద యాత్ర చేయండి. అప్పుడే ఎంత మంది కిరాయికి ఉంటున్నారో మీకు అర్థం అవుతుంది. పల్లెటూరులో ఇల్లు ఇచ్చి పదే పదే చూపించుకోకండి. హైదరాబాద్ లో ఇల్లు ఇచ్చి అందరినీ ఆదుకోండి. చేసిన కష్టం ఇంటి కిరాయిలకే పోతుంటే పిల్లల్ని ఎలా చదివించుకుంటాం. ఎలా బతుకుతాం. బాధలు పడి చదివిన విద్యార్థులకు జాబులు ఇవ్వడం లేదు. ఇవి పిచ్చి గీతలు అనుకోకండి. పేదలు తలచుకుంటే రాజకీయ పార్టీలను గెలిపించాలన్నా పడగొట్టాలన్నా ప్రజల చేతుల్లోనే ఉంది. ప్రజల సమస్యలను పట్టించుకోకుంటే ఎక్కడి నుంచి వచ్చారో అక్కడికే వెళ్లతారు. అది మీ ఇష్టం. అందుకే తెలగాణను దోచుకోవడం బంద్ చేసి ప్రజలను పట్టించుకోండి. నేను అడిగిన ప్రశ్నలకు త్వరలోనే సమాధానం చెబుతారని అనుకుంటున్నా. ఎన్ని ఏళ్లు అయినా పేదలు పెదవారిగానే, కోటీశ్వర్లు వందల కోట్లు సంపాధిస్తూ మరింత కోటీశ్వరులుగా అవుతున్నాయి. తెలంగాణ సంపద అందరిదీ అని అంబేద్కర్ చెప్పాడు. కానీ ఇప్పుడు కొంత మందితే ఈ సంపద అయిపోయింది. నేను చెప్పిన దాంట్లో ఎదైనా తప్పు ఉంటే క్షమించాలి. లేదంటే నా పేపర్లు అన్ని చించి పారేయండి నా దారిన నేను పోతాను' అంటూ ఈ పోస్టర్లపై రాసి అతికించారు.

పోలీసుల అదుపులో మహిళ:

ఈ పోస్టర్లను గమనించిన సిబ్బంది వాటిని తొలగించారు. అయితే సచివాలయం వంటి హై సెక్యూరిటీ జోన్‌లో పోస్టర్లు అంటించడం చర్చనీయాంశంగా మారింది. అక్కడ విధులు నిర్వహిస్తున్న స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బంది వెంటనే స్పందించి ఆమెను అదుపులోకి తీసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం ఆమెను సైఫాబాద్ పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# తీవ్ర సంక్షోభం.. ఆదుకోండి: చంద్రబాబుకు బీజేపీ స్టేట్ అధ్యక్షుడి లేఖ



**న్యూస్ డెస్క్,15 జూన్ (తెలుగు గళం):** చిత్తూరు జిల్లాలో మామిడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దిగుమతి భారీగా వచ్చిన పంటకు సరైన రేటు లేకపోవడంతో నష్టపోతున్నారు. దీంతో వారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు. చిత్తూరు జిల్లా పర్యటనకు వెళ్తున్న ప్రతి పార్టీ నాయకులకు తమ పరిస్థితిని విన్నవించుకుంటున్నారు. తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరుకుంటున్నారు. ఇలా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎస్ మాధవ్ దృష్టికి వచ్చింది. దీంతో ఆయన స్పందించారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు లేఖ రాశారు. చిత్తూరు జిల్లా మామిడి రైతులు తీవ్ర సంక్షోభంలో ఉన్నారని, మామిడి కొనుగోళ్లలో ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని లేఖలో కోరారు. మామిడికి కనీస మద్దతు ధర ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

# నేడు ఇందిరా గాంధీ బ్రతికి ఉంటే బీజేపీని బ్యాన్ చేసేవారు: మాజీ సీఎం అశోక్ గెహ్లాట్



**న్యూస్ డెస్క్,15 జూన్ (తెలుగు గళం):** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ బీజేపీ పార్టీపై సంచలన వ్యాఖ్యలు చేశారు. జైపూర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో అశోక్ గెహ్లాట్.. భారతీయ జనతా పార్టీ (బీజేపీ) లక్ష్యంగా సంచలన వ్యాఖ్యలు చేశారు. దేశంలో ప్రస్తుతం ఉనికిలో ఉన్న పరిస్థితులు అత్యంత ప్రమాదకరంగా మారాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. నేడు గనుక మాజీ ప్రధాని ఇందిరా గాంధీ బ్రతికి ఉండి ఉంటే, మతాన్ని రాజకీయం కోసం వాడుకుంటున్న బీజేపీ లాంటి పార్టీపై ఖచ్చితంగా నిషేధం (బ్యాన్) విధించేవారని గెహ్లాట్ వ్యాఖ్యానించారు. దేశాన్ని బలోపేతం చేయాల్సింది పోయి, ముస్లింలను లక్ష్యంగా చేసుకుని కావాలనే మతపరమైన ఎజెండాను ముందుకు నెడుతూ బీజేపీ దేశాన్ని బలహీనపరుస్తోందని ఆయన ఆరోపించారు. తాము కేవలం 'హిందుత్వ' పార్టీ అని దేశ ప్రజలకు నిరూపించుకోవడానికే వారు ఇలాంటి రాజకీయాలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.

దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థలను బలహీనపరుస్తున్న ఇలాంటి శక్తులకు వ్యతిరేకంగా పోరాడటానికి 'ఇండియా' కూటమిని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని, ఈ కూటమికి రాహుల్ గాంధీ బహిరంగంగా నాయకత్వం వహించాలని గెహ్లాట్ కోరారు. గతంలో ఇందిరా గాంధీ కాలంలో 'కాంగ్రెస్ హటావో, దేశ్ బచావో' అంటూ విపక్షాలన్నీ ఏకమైనప్పటికీ.. కేవలం రెండున్నర ఏళ్లలోనే ప్రజలు ఆమెను తిరిగి అధికారంలోకి తెచ్చారని గుర్తుచేశారు. ప్రజలు నిజం గ్రహించి కాంగ్రెస్ వైపు నిలబడిన రోజున.. ప్రస్తుతం ఎన్డీయే కూటమిలో ఉన్న పార్టీలన్నీ బీజేపీకి వ్యతిరేకంగా మారుతాయని అశోక్ గెహ్లాట్ ధీమా వ్యక్తం చేశారు.

# తెలంగాణ ఓటర్లకు అలర్ట్.. జూన్ 25 నుంచి ఇంటింటి సర్వే..!

మొదటి పేజీ తరువాయి




జిల్లా ఎన్నికల అధికారుల వారిగా క్షేత్ర స్థాయిలో ఈ సన్నద్ధత కార్యక్రమాన్ని చేపడతారు. ఇక రెండో దశలో సర్ సర్వేలో డిఈఓ, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, బిఎల్ఓ పర్యవేక్షకులు, బిఎల్ఓలకు శిక్షణ అందిస్తారు. మూడో దశలో సర్వేలో భాగంగా ఇంటింటికి అందించే ఎన్యుమరేషన్ పత్రాలని ముద్రిస్తారు. సన్నద్ధత ఏర్పాట్లు పూర్తయిన తర్వాత ఈ నెల 25 నుంచి జూలై 24 వరకు బిఎల్ఓలు సర్ సర్వేను నిర్వహిస్తారు. జూలై 31న ముసాయిదా జాబితాను ప్రదర్శించనున్నారు. జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు ఫిర్యాదులు అభ్యంతరాల స్వీకరణ సందేహాలు ఉన్న ఓటర్లకు నోటీసులు జారీ చేస్తారు. వారి గుర్తింపు కార్డుల పరిశీలన ప్రక్రియలను చేపడతారు. అక్టోబర్ 1న ఓటర్ల తుది జాబితాను ప్రదర్శిస్తారు.

# కాంగ్రెస్ తీరు ఇప్పటికీ మారలేదు : డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

మొదటి పేజీ తరువాయి



అప్పట్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాన్ని విభజించిన అనాలోచిత తీరు వల్ల రెండు ప్రాంతాల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి, అశాంతి నెలకొన్నాయని.. ఆ తప్పుడు విభజన వల్లే నేటికీ రెండు రాష్ట్రాల మధ్య ఆస్తుల పంపిణీ సహా పలు వివాదాలు నలుగుతూనే ఉన్నాయని ఆయన పవన్ కల్యాణ్ తప్పుపట్టారు. విభజన శక్తులపై రాజీలేని పోరాటం చేయడమే తెలంగాణలో జనసేన ప్రస్థానం ప్రారంభించినప్పటి నుంచి తమకున్న ఏకైక నిబద్ధత అని గుర్తుచేశారు. అలాగే సొంత రాష్ట్రాల్లో 'ఢిల్లీ మెడలు వంచుతాం' అంటూ ప్రగల్భాలు పలికే నాయకులు, తీరా ఇక్కడికి రాగానే నోరు విప్పలేకపోతున్నారంటూ పరోక్షంగా ఇతర రాజకీయ పక్షాలపై పవన్ కల్యాణ్ పదునైన విమర్శలు గుప్పించారు.

# కేరళలో నిఫా వైరస్ కల్లోలం.. సరిహద్దుల్లో హై అలర్ట్!




**న్యూస్ డెస్క్,15 జూన్ (తెలుగు గళం):** కేరళం రాష్ట్రంలో మరోసారి నిఫా వైరస్ కలకలం గా మారింది. గంటగంటకు పెరుగుతున్న పాజిటివ్ కేసులతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా కోజికోడ్‌లో ఈ నిఫా వైరస్ కలకలం రేపుతోంది. అక్కడ రెండు వందల మందికి పైగా ఈ వైరస్ బారిన పడినట్లు నిర్ధారణ అయింది. దీంతో పొరుగు రాష్ట్రమైన తమిళనాడు అప్రమత్తమైంది. కేరళతో సరిహద్దు పంచుకుంటున్న కోయంబత్తూర్, తెని, కన్యాకుమారి తో పాటు కడలూరు జిల్లాల వైద్య ఆరోగ్య శాఖలను తమిళనాడు ప్రభుత్వం హై అలర్ట్ చేసింది. సరిహద్దు దాటి వచ్చే ప్రయాణికులపై నిఘా ఉంచడంతో పాటు, నిఫా లక్షణాలు ఉన్నట్లు అనుమానం వచ్చిన వారిని వెంటనే గుర్తించి మెడికల్ క్యాంపులకు తరలిస్తున్నారు. వైరస్ రాష్ట్రంలోకి వ్యాపించకుండా తమిళనాడు సర్కార్ అన్ని ముందస్తు జాగ్రత్తలు ముమ్మరం చేసింది. దీంతో కేరళం, తమిళనాడు సరిహద్దు గ్రామాల్లో ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు.

# మెట్రోపై బీజేపీ-బీఆర్ఎస్ కుట్ర?



**న్యూస్ డెస్క్,15 జూన్ (తెలుగు గళం):** హైదరాబాద్ ను అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దాలంటే అంతర్జాతీయ ప్రమాణాల రవాణా సౌకర్యాలు అవసరమని, ఆ ఆలోచనతోనే మెట్రో రైలు ప్రాజెక్టును ప్రారంభించారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. మెట్రో రైలు నిర్మాణ నిర్ణయం యూపీఏ ప్రభుత్వ హయాంలో సోనియా గాంధీ, అప్పటి పట్టణాభివృద్ధి శాఖ మంత్రి జైపాల్ రెడ్డి, ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి కలిసి తీసుకున్నారని గుర్తు చేశారు.

ప్రారంభంలో రూ.15 వేల కోట్ల అంచనాతో మెట్రో పనులు చేపట్టారని.. 2017 నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళ్లారని సీఎం తెలిపారు. అయితే తెలంగాణ ఏర్పడిన తర్వాత అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ చారిత్రక ప్రాంతాల పేరుతో అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో 2014 నుంచి 2017 వరకు నిర్మాణ పనులు నిలిచిపోయాయని ఆరోపించారు. ఫలితంగా 2020 నాటికీ ప్రాజెక్టు పూర్తికాలేదని, గౌలిగూడ ప్రాంతంలో పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయని చెప్పారు. దీంతో ప్రాజెక్టు వ్యయం రూ.20 వేల కోట్లకు చేరిందన్నారు.

మెట్రో విస్తరణ విషయంలో గత ప్రభుత్వం ప్రజల అవసరాల కంటే కొందరు రియల్ ఎస్టేట్ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రణాళికలు రూపొందించిందని రేవంత్ విమర్శించారు. ప్రజలకు అవసరమైన ప్రాంతాలకు మెట్రో విస్తరణ జరగలేదని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెట్రో రెండో దశ విస్తరణ చేపట్టాలని నిర్ణయించిందన్నారు. మెట్రో ఫేజ్-2కు అనుమతులు, నిధులు ఇవ్వాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు కేంద్ర మంత్రులను పలుమార్లు కోరామని తెలిపారు. ఎల్ అండ్ టీ సంస్థను కూడా విస్తరణకు ఒప్పించే ప్రయత్నం చేశామని, అయితే గత ప్రభుత్వ విధానాల కారణంగా తమకు రూ.7 వేల కోట్ల నష్టం వచ్చిందని చెబుతూ సంస్థ సహకరించలేదని వివరించారు. రూ.13,600 కోట్ల అప్పుతో పాటు భారీ వడ్డీ భారం కారణంగా నష్టాల్లో ఉన్నామని ఎల్ అండ్ టీ చెప్పిందన్నారు.

కేంద్ర ప్రభుత్వం కూడా ఫేజ్-2కు ముందుగా ఎల్ అండ్ టీ అనుమతి తీసుకురావాలని సూచించిందని, మళ్లీ చర్చలు జరిపినా సంస్థ అంగీకరించలేదని చెప్పారు. ఈ విషయాన్ని కేంద్రానికి వివరించగా, ఎల్ అండ్ టీ మెట్రో ఆస్తులను కొనుగోలు చేయాలని సూచించిందన్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఆ ప్రతిపాదనకు అంగీకరించిందని తెలిపారు. దాదాపు రూ.30 వేల కోట్ల విలువైన ఎల్ అండ్ టీ మెట్రో ఆస్తులను రూ.15 వేల కోట్లకే కొనుగోలు చేసే ప్రక్రియ ప్రారంభించామని సీఎం వెల్లడించారు. ప్రతి ఏడాది సుమారు రూ.400 కోట్ల నష్టం వస్తున్నందున సంస్థ కూడా ఈ ప్రతిపాదనకు అంగీకరించిందన్నారు. అలాగే రూ.13,600 కోట్ల అప్పును తక్షణమే చెల్లించడం ద్వారా వడ్డీ భారం తగ్గించవచ్చని వివరించారు.

తక్కువ వడ్డీకి రుణాలు పొందేందుకు ప్రయత్నించామని.. ఇందుకోసం ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ తో చర్చలు జరిపామని తెలిపారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం 11.5 శాతం వడ్డీకి భారీగా అప్పులు తెచ్చుకుందని ఆరోపించిన సీఎం.. తాము కేవలం 4 శాతం వడ్డీకి రుణం పొందేందుకు అనుమతులు సాధించామని చెప్పారు. దీంతో మెట్రో ప్రాజెక్టు మొదటి రోజునుంచే లాభదాయకంగా మారే అవకాశం ఉందన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం చివరి నిమిషంలో నిధుల విడుదలను నిలిపివేసిందని రేవంత్ ఆరోపించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఖతార్‌లో జరిగిన సమావేశాల్లో జోక్యం చేసుకున్నారని పేర్కొంటూ.. తెలంగాణలో బీజేపీ రాజకీయ ప్రయోజనాల కోసం మెట్రో విస్తరణకు అడ్డంకులు సృష్టిస్తున్నారని విమర్శించారు.

కేంద్ర భాగస్వామ్యం అవసరం లేదని, కనీసం ఎన్‌వోసీ ఇచ్చి ప్రాజెక్టును ముందుకు సాగనివ్వాలని తాను కోరానని సీఎం తెలిపారు. అయితే బీజేపీ, బీఆర్ఎస్ కలిసి మెట్రో విస్తరణను అడ్డుకునేందుకు కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకోవడమే వారి లక్ష్యమని విమర్శించారు. మెట్రో విస్తరణకు సంబంధించిన నిధుల విడుదల విషయంలో కిషన్ రెడ్డి స్పష్టత ఇవ్వాలని, తెలంగాణ ప్రజల ప్రయోజనాల కోసం సహకరించాలని సీఎం డిమాండ్ చేశారు.

# తెలంగాణలో డిజిటల్ పాలన.. ఈ-కేబినెట్‌కు గ్రీన్ సిగ్నల్!

మొదటి పేజీ తరువాయి




దీని ద్వారా మంత్రులకు పంపే కేబినెట్ అజెండా నోట్స్, ప్రతిపాదనలు అన్నీ కూడా ఎలక్ట్రానిక్ విధానంలోనే పంపనున్నారు. సమావేశంలో తీసుకునే కీలక నిర్ణయాలు, ఆమోదించే తీర్మానాలు సైతం వెంట వెంటనే డిజిటల్ రూపంలో రికార్డు కానున్నాయి.

ఈ-కేబినెట్ విధానం వల్ల ప్రభుత్వానికి అనేక ప్రయోజనాలు చేకూరనున్నాయి. కాగితాల వాడకం తగ్గడం వల్ల పర్యావరణానికి మేలు జరగడమే కాకుండా.. ప్రభుత్వ వ్యయం కూడా భారీగా తగ్గుతుంది. అన్నింటికంటే ముఖ్యంగా కేబినెట్ సమావేశాల్లో చర్చకు వచ్చే అత్యంత కీలకమైన, రహస్యమైన సమాచారం బయటకు పొక్కకుండా పటిష్టమైన భద్రత లభిస్తుంది. ప్రతి నిర్ణయం ఆన్‌లైన్ వ్యవస్థలో నిక్షిప్తం కావడం వల్ల పరిపాలనలో జవాబుదారితనం మరింత పెరుగుతుంది. భారతదేశంలో ఇటువంటి పేపర్‌లెస్ కేబినెట్ విధానాన్ని దేశంలోనే తొలిసారిగా హిమాచల్‌ప్రదేశ్ ప్రభుత్వం విజయవంతంగా అమలు చేసింది. ఆ తర్వాత ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్ర, ఆంధ్ర ప్రదేశ్, ఉత్తరాఖండ్, త్రిపుర, మేఘాలయ, అరుణాచల్ ప్రదేశ్ వంటి రాష్ట్రాలు ఈ డిజిటల్ విధానాన్ని అందిపుచ్చుకున్నాయి. ఇప్పుడు అదే బాటలో తెలంగాణ కూడా చేరబోతోంది.

ఈ-కేబినెట్ సమావేశాల నిర్వహణకు సంబంధించి సాధ్యాసాధ్యాలు, సాంకేతిక ఏర్పాట్లపై ఇటీవలే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఐటీ, జీఏడీ ఉన్నతాధికారులతో కలిసి ఒక ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ట్యాబ్‌ల పనితీరు, సాఫ్ట్‌వేర్ భద్రత, నెట్‌వర్క్ కనెక్టివిటీ వంటి అంశాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. రానున్న రోజుల్లో జరగబోయే తదుపరి రాష్ట్ర మంత్రివర్గ సమావేశాన్ని ప్రయోగాత్మకంగా లేదా పూర్తి స్థాయిలో ఎలక్ట్రానిక్ విధానంలోనే నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లను వేగవంతం చేస్తున్నారు.

# ఈ నెల 18న తెలంగాణ కేబినెట్ భేటీ!



**న్యూస్ డెస్క్,15 జూన్ (తెలుగు గళం):** ఈ నెల 18న తెలంగాణ కేబినెట్ భేటీ కాబోతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు మంత్రి మండలి సమావేశం జరగనుంది. మెట్రో టేకోవర్?పై సందిగ్ధత ఏర్పడడంతో నెక్ట్స్ ఏం చేయాలన్న అంశంతో పాటు రాష్ట్రంలో నెలకొన్న తాజా పరిణామాలపై ప్రభుత్వం మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకోనుంది. వ్యవసాయం, సాగునీటి ప్రాజెక్టులతో పాటు పలు కీలక అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. త్వరలో జీహెచ్ఎంసీ ఎన్నికలు జరగాల్సి ఉన్నందునా ఈ అంశంపై కూడా మంత్రి వర్గంలో చర్చకు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే గురువారం జరగబోయే రాష్ట్ర కేబినెట్ సమావేశం ఎలక్ట్రానిక్ విధానంలో జరగనుంది. రాష్ట్రంలో ఇకపై ఈ-కేబినెట్ మీటింగ్స్ నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించిన నేపథ్యంలో అధికారులు ఇందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయనున్నారు. పరిపాలనలో పేపర్ లెస్ విధానం తీసుకురావాలని సీఎం అధికారులకు సూచించారు.


# 'కాక్రోచ్ జనతా పార్టీ'పై పవన్ కల్యాణ్ సంచలన వ్యాఖ్యలు




**న్యూస్ డెస్క్,15 జూన్ (తెలుగు గళం):** గతకొన్ని నెలలుగా సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోన్న కాక్రోచ్ జనతా పార్టీపై జనసేన పార్టీ అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. సోమవారం 'జాతీయ సమగ్రత కోసం సేన ప్రస్థానం' పేరిట జనసేన ఆధ్వర్యంలో ఢిల్లీలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. 'చాలాసార్లు మనకుమనం తక్కువ అంచనా వేసుకున్నాం. ప్రతి వ్యక్తి కూడా సమాజంలో మార్పు తీసుకురావచ్చు. ఈ మధ్య కాక్రోచ్ జనతా పార్టీ ఎలా పుట్టుకొచ్చిందో అందరం చూస్తూనే ఉన్నాం. కాక్రోచ్ పార్టీని చూస్తే చలిచీమల పద్యం గుర్తుకు వస్తోంది. చలి చీమలు కూడా బలమైన పాములను చంపేస్తాయి. ఒక లక్ష్యం పెట్టుకుని.. ఆ లక్ష్యం దిశగా ప్రయత్నం చేస్తే ఎవరైనా సక్సెస్ అవుతారు. ఇందులో ఎలాంటి సందేహం లేదు' అని పవన్ కల్యాణ్ చెప్పుకొచ్చారు.

అంతకుముందు.. జనసేన ప్రారంభించినప్పుడు దేశ సమగ్రత, శ్రేయస్సు తప్ప.. తనకు ఏ ఆలోచనా లేదని అన్నారు. పార్టీ స్థాపించినప్పుడు అధికారం వస్తుందో, రాదో కూడా తెలియదన్నారు. కానీ ఈ ప్రయాణంలో చాలా పోరాటాలు చేశామని, పరాజయాలు ఎదుర్కొన్నాము, విజయాలూ సాధించామని చెప్పారు. లక్ష మంది సభ్యత్వంతో ప్రారంభమైన జనసేన, నేడు 20 లక్షలకుపైగా సభ్యత్వాలు వచ్చాయని అన్నారు. అంతేగాకుండా.. తెలంగాణ ఏర్పాటుకు ఏనాడూ జనసేన అడ్డు చెప్పలేదు. 2014లో ఏపీని విభజించిన తీరును చూసి మాత్రమే ఆవేదన వ్యక్తం చేశాం. విభజన విషయంలో కాంగ్రెస్ వ్యవహరించిన తీరు.. అసంతృప్తిని, అశాంతిని సృష్టించింది. అప్పటి నుంచి ఇప్పటికీ వారి ధోరణి మారలేదు. జనసేన సభకు అనుమతివ్వకుండా అడ్డుకోవడమే అందుకు ఉదాహరణ అని పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు.

# జైపూర్‌లో కాక్రోచ్ జనతా పార్టీ నిరసన చీఫ్ అభిజీత్ దీప్కేపై దుండగుల అటాక్



**న్యూస్ డెస్క్,15 జూన్ (తెలుగు గళం):** నీట్ పరీక్షల పేపర్ లీకేజీ, పెరుగుతున్న నిరుద్యోగ సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని నిరసిస్తూ జైపూర్‌లోని షహీద్ స్మారక్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఆధ్వర్యంలో భారీ ఆందోళనలు చేపట్టారు. అయితే, ఈ ఆందోళనల సందర్భంగా అభిజీత్ దీప్కేపై దుండగులు మొఖంపై చంపదెబ్బలతో ఒక్కసారిగా అటాక్ చేశారు. అసలు ఏం జరుగుతుందో తేరుకునే లోపే దాడి చేసిన వారు అక్కడి నుంచి పరార్ అయ్యేందుకు ప్రయత్నించగా సీజేపీ కార్యకర్తలు పట్టుకుని తిరిగి వారికి దేహశుద్ధి చేశారు. కాగా, గత నెలలో కూడా అభిజీత్ దీప్కేకు వాట్సాప్ ద్వారా గుర్తుతెలియని వ్యక్తుల నుంచి ప్రాణహాని బెదిరింపులు వచ్చిన మాట వాస్తవమే. ఆ సమయంలో ఆయన సోషల్ మీడియా ఖాతాలను హ్యాక్ చేయడానికి కొందరు ప్రయత్నించారు. ఈ నేపథ్యంలోనే జైపూర్‌లో నిరసనల వేళ ఆయనకు భారీ భద్రత కల్పించనప్పటికీ దుండగులు దాడి చేయడం గమనార్హం. ప్రస్తుతం దాడికి సంబంధించి వీడియోలు సైతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.

## నెల 17న జరిగే రైతు సంఘం జిల్లా మహాసభను జయప్రదం చేయండి


### - సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జువారి రమేష్



జఫర్‌గడ్, జూన్ 15 (తెలుగు గళం న్యూస్)

జాఫర్‌గడ్ మండల కేంద్రంలో రైతు సంఘం ముఖ్యకార్యకర్తల సమావేశం మండల అధ్యక్షుడు ఎం.డి. యాకూబ్ పాషా అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల కార్యదర్శి జువారి రమేష్ హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై రైతులు ఐక్యంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టే విధంగా కేంద్రం వ్యవహరిస్తోందని, సబ్సిడీలను ఎత్తివేసే ప్రయత్నాలు రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తాయని ఆరోపించారు. ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటికీ నిల్వ ఉండటం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం రైతు సంఘం నిరంతరం పోరాటం చేస్తోందని తెలిపారు. ఈ నెల 17న మండల కేంద్రంలోని ఆర్యవైశ్య ఫంక్షన్ హాలులో రైతు సంఘం జిల్లా మహాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మహాసభకు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని చెప్పారు. రైతు సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి ఎం.డి. నూరున్నిసా, రైతు సంఘం మండల కార్యదర్శి పెండ్యాల సమ్మయ్య, మంద బుచ్చయ్య, బుల్లె దూడయ్య, కలకోటి యాదగిరి, బత్తిని శ్రీనుగౌడ్, కస్తూరి ఎల్లయ్య, శివరాత్రి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## మోదీ సుపరిపాలన వికసిత్ భారత్ సంకల్ప సమ్మేళనంలో పాల్గొన్న వలీపాషా



(తెలుగు గళం న్యూస్ జనగామ)

జనగామలోని విజయ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన "12 సంవత్సరాల మోదీ సుపరిపాలన -- వికసిత్ భారత్ సంకల్ప సమ్మేళనం" మేధావుల సదస్సుకు పలువురు నాయకులు, మేధావులు, పార్టీ కార్యకర్తలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జనగామ జిల్లా మైనార్టీ మోర్చా అధ్యక్షులు ఎం.డి. వలి పాషా, బీజేపీ జఫర్‌గఢ్ మండల మన్ కీ బాత్ కో-కన్వీనర్ ఎడెల్లి కార్తీక్, మాచర్ల రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు గత 12 సంవత్సరాలుగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం సాధించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల విస్తరణ, డిజిటల్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ వంటి పథకాల గురించి వివరించారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశంగా దేశాన్ని తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు.

## తొండ గ్రామం వద్ద ప్రమాదకరంగా హైటెన్షన్ విద్యుత్ వైర్లు



తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్

తొర్రూరు-- తిరుమలగిరి ప్రధాన రహదారిపై తొండ గ్రామ పరిధిలో హైటెన్షన్ విద్యుత్ వైర్లు రహదారికి అత్యంత సమీపంగా వేలాడుతున్నట్లు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితి వాహనదారులు, ముఖ్యంగా భారీ వాహనాల రాకపోకలకు ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని వారు చెబుతున్నారు. విద్యుత్ వైర్లు తక్కువ ఎత్తులో ఉండటం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశముందని, సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి పరిశీలించి తగిన చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. జాతీయ రహదారిపై నిత్యం భారీ సంఖ్యలో వాహనాలు సంచరిస్తున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకముందే సమస్యను పరిష్కరించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. స్థానికుల ఫిర్యాదుల మేరకు అధికారులు స్పందించి వైర్ల ఎత్తు, భద్రతా ప్రమాణాలను పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

## ఉద్యోగ ఒత్తిడితో యువతి ఆత్మహత్య

తెలుగు గళం న్యూస్ వరంగల్, జూన్ 15

వరంగల్ నగరంలోని కాశీబుగ్గ ప్రాంతంలో సోమవారం విషాద ఘటన చోటుచేసుకుంది. కాశీబుగ్గ తిలక్ రోడ్డుకు చెందిన గంజి కీర్తన (25) అనే యువతి తన నివాసంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం, కీర్తన బెంగళూరులోని ఓ విదేశీ సంస్థలో ఉద్యోగం చేస్తూ ఉండేది. గత కొంతకాలంగా ఉద్యోగ ఒత్తిడిని తట్టుకోలేక తీవ్ర మానసిక ఆందోళనకు గురై చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. సోమవారం ఉదయం ఆమె తండ్రి గంజి ఉమాశంకర్ వ్యాపార పనుల నిమిత్తం బయటకు వెళ్లగా, తల్లి కృష్ణవేణి గ్రీవెన్స్ సెల్‌కు వెళ్లిన సమయంలో కీర్తన ఇంట్లో ఒంటరిగా ఉన్నట్లు తెలిసింది. ఉదయం సుమారు 11:30 గంటలకు ఇంటికి వచ్చిన తల్లి కిటికీ ద్వారా చూడగా కీర్తన బెడ్‌రూమ్‌లో ఫ్యాన్‌కు చున్నితో ఉరికి వేలాడుతూ కనిపించింది. వెంటనే బంధువుల సహాయంతో తలుపులు బలవంతంగా తెరిచి లోపలికి వెళ్లి చున్ని కోసి కిందకు దించినప్పటికీ అప్పటికే ఆమె మృతి చెందినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కీర్తన మరణంపై తమకు ఎలాంటి అనుమానాలు లేవని కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు.

## కేబుల్ టీవీ జర్నలిస్టుల హక్కుల సాధనకు రౌండ్ టేబుల్ సమావేశం

### అక్రిడిటేషన్ కమిటీలలో కేబుల్ టీవీ రంగానికి తగిన ప్రాతినిధ్యం కల్పించాలి




హైదరాబాద్, జూన్ 15 (తెలుగు గళం న్యూస్)

తెలంగాణ రాష్ట్రంలోని కేబుల్ టీవీ రంగానికి చెందిన జర్నలిస్టులు, నిర్వాహకులు, ఎంఎస్‌వోలు, సీఈఓలు మరియు ప్రతినిధుల సమక్షంలో కేబుల్ టీవీ రంగ సమస్యలు, జర్నలిస్టుల అక్రిడిటేషన్ హక్కుల సాధనపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశం సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో విజయవంతంగా జరిగింది. ఈ సమావేశానికి మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, జేఏసీ ముఖ్య సలహాదారుడు సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, టీజేఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఆనం చిన్ని వెంకటేశ్వరరావు, ఏడబ్ల్యూజేఏ జాతీయ అధ్యక్షుడు కె. కోటేశ్వరరావు, ఎంఎస్‌వో కోలా కిషోర్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సమావేశంలో కేబుల్ టీవీ రంగానికి సంబంధించిన పలు కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా కేబుల్ టీవీ ఛానళ్లలో పనిచేస్తున్న జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయడం, డిజిటల్ మీడియా విస్తరణ నేపథ్యంలో జర్నలిస్టుల హక్కులను పరిరక్షించడం, రాష్ట్ర మరియు జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కమిటీలలో కేబుల్ టీవీ రంగానికి తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరంపై అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ సందర్భంగా పలువురు ముఖ్య అతిథులు మాట్లాడుతూ కేబుల్ టీవీ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, వారికి న్యాయం జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అక్రిడిటేషన్ ప్రతి జర్నలిస్టుకు మౌలిక హక్కు అని, కేబుల్ టీవీ రంగాన్ని కూడా ప్రధాన మీడియా విభాగంగా గుర్తించి సమాన అవకాశాలు కల్పించాలని పేర్కొన్నారు. సమావేశంలో పాల్గొన్న నాయకులు, జర్నలిస్టులు ఐక్యంగా ముందుకు సాగితేనే హక్కుల సాధన సాధ్యమవుతుందని పిలుపునిచ్చారు. కేబుల్ టీవీ రంగానికి బలమైన వేదికగా ఈ సమావేశం నిలిచిందని నిర్వాహకులు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని కేబుల్ టీవీ సంస్థలు, జర్నలిస్టులు సంఘటితంగా పనిచేస్తూ తమ హక్కుల సాధన కోసం ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్లు బి. నరసింహాచారి, భరత్ కుమార్, డా. మహ్మద్ యాసిఫ్ పాషా, పొదిళ్ల వెంకట్, మహేష్ కుమార్ ఉపాధ్యాయ, రాచర్ల గోపి, డా. బాను ప్రసాద్, పీట్ల ప్రతాప్, జితేందర్, శ్రీనివాస్, వేణుగోపాల్, కలీమ్, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తే ఇంటి పన్ను నల్ల బిల్లు మినహాయింపు

### ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి రాఘవపూర్ సర్పంచ్ చారిత్రాత్మక నిర్ణయం

స్టేషన్ ఘనపూర్, జూన్ 15 (తెలుగు గళం న్యూస్)

స్టేషన్ ఘనపూర్ మండలం రాఘవాపురం గ్రామ సర్పంచ్ మెరుగు క్రాంతి కుమార్ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల సంఖ్య పెంపు లక్ష్యంగా వినూత్న నిర్ణయం తీసుకున్నారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించే తల్లిదండ్రులకు నల్ల బిల్లు (నీటి పన్ను) మరియు ఇంటి పన్ను మినహాయింపు కల్పిస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా సర్పంచ్ క్రాంతి కుమార్ మాట్లాడుతూ, గ్రామ ప్రభుత్వ పాఠశాలను కాపాడుకోవడం ప్రతి గ్రామస్తుడి బాధ్యత అని అన్నారు. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య, సౌకర్యాలు అందిస్తోందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి




వారికి ఉజ్వల భవిష్యత్తు కల్పించాలని పిలుపునిచ్చారు. ప్రతి నెల నిర్వహించే తల్లిదండ్రుల సమావేశాల ద్వారా పిల్లల విద్యా పురోగతిని తెలుసుకునే అవకాశం ప్రభుత్వం కల్పిస్తోందని తెలిపారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు కఠినమైన పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణులై ఉద్యోగాలు సాధించిన ప్రతిభావంతులని, అలాంటి ఉపాధ్యాయుల వద్ద చదివే విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకుంటారని పేర్కొన్నారు. తన పిల్లలను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించినట్లు సర్పంచ్ వెల్లడించారు. గ్రామ ప్రజలంతా ప్రభుత్వ పాఠశాలల పట్ల విశ్వాసం పెంచుకుని తమ పిల్లలను అక్కడే చేర్పించాలని కోరారు. సర్పంచ్ తీసుకున్న ఈ నిర్ణయాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు స్వాగతిస్తూ ఆయనకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో ప్రభుత్వ విద్యాభివృద్ధికి ఈ నిర్ణయం ఆదర్శంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.

## భూపాలపల్లి జిల్లాలో స్కూల్ బస్సులపై రవాణా శాఖ కొరడా

### 32 వాహనాల తనిఖీ.. ఫిట్‌నెస్, పర్మిట్ లేని స్కూల్ బస్సులపై కేసులు నమోదు

### పిల్లల ప్రాణాలతో చెలగాటం ఆడడానికి వీల్లేదు-జిల్లా రవాణా అధికారి ఎం వెంకన్న

తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి

నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో విద్యార్థుల భద్రతను శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని రవాణా శాఖ అధికారులు సోమవారం ఉదయం నుంచే రోడ్లపైకి దిగి విద్యాసంస్థల బస్సులపై ప్రత్యేక తనిఖీ డ్రైవ్ నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా, కనీస రక్షణ ప్రమాణాలు పాటించకుండా రోడ్లపై తిరుగుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న స్కూల్, కాలేజీ బస్సులను పట్టుకునేందుకు జిల్లా రవాణా అధికారి ఎం. వెంకన్న నేతృత్వంలో అధికారులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి జిల్లా వ్యాప్తంగా ప్రధాన కూడళ్లలో ఈ తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా వివిధ ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలలకు చెందిన మొత్తం 32 విద్యాసంస్థల బస్సులను అధికారులు ఆపి, వాటికి సంబంధించిన రికార్డులను, వాహన కండిషన్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ ముమ్మర తనిఖీల్లో మోటారు వాహనాల చట్టం, రవాణా శాఖ నిబంధనలను బేఖాతరు చేస్తూ నడుపుతున్న రెండు ప్రముఖ విద్యాసంస్థల బస్సులను అధికారులు పట్టుకున్నారు. వాటిపై తక్షణమే వీసీఆర్‌లు (వెహికిల్ కంట్రోల్ రిపోర్ట్) నమోదు చేసి, చట్టపరమైన కేసులు బుక్ చేశారు. పట్టుబడిన వాహనాలలో ఒక బస్సు కాలపరిమితి ముగిసినప్పటికీ, కనీస ఫిట్‌నెస్ సర్టిఫికేట్ కూడా లేకుండా రోడ్డుపై విద్యార్థులను తరలిస్తుండగా అధికారులు రికార్డులతో సహా పట్టుకున్నారు. అలాగే మరొక బస్సు ప్రభుత్వం తమకు




కేటాయించిన రూట్, పర్మిట్ నిబంధనలను పూర్తిగా ఉల్లంఘిస్తూ (పర్మిట్ వాయిలేషన్) నడుపుతున్నట్లు అధికారులు క్షేత్రస్థాయి పరిశీలనలో నిర్ధారించారు. నిబంధనలు ఉల్లంఘించిన ఈ రెండు బస్సుల యాజమాన్యాలపై మోటారు వాహనాల చట్టం (ఎం వి) కింద కఠినమైన చర్యలు ప్రారంభించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా రవాణా అధికారి (డి టి ఓ) ఎం. వెంకన్న పత్రికా ముఖంగా విద్యాసంస్థల యాజమాన్యాలకు బలమైన హెచ్చరికలు జారీ చేశారు. జిల్లాలో ఏ ఒక్క ప్రైవేట్ పాఠశాల లేదా కళాశాల యాజమాన్యం అన్‌ఫిట్ బస్సులను రోడ్లపైకి తీసుకురావద్దని స్పష్టం చేశారు. ప్రతి బస్సుకు చెల్లుబాటు అయ్యే ఫిట్‌నెస్ సర్టిఫికేట్, పొల్యూషన్ కంట్రోల్ పత్రాలు, ఇన్సూరెన్స్, పక్కా పర్మిట్ పత్రాలు వాహనంలోనే అందుబాటులో ఉండాలన్నారు. బస్సులను నడిపే డ్రైవర్లకు కనీసం ఐదేళ్ల అనుభవం ఉండటంతో పాటు హెవీ డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి అని, అలాగే వాహనంలో విధిగా ప్రథమ చికిత్స కిట్, అగ్నిమాపక పరికరాలు, అత్యవసర ద్వారం సక్రమంగా పనిచేసే స్థితిలో ఉండాలని ఆదేశించారు. విద్యార్థుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ పడే ప్రసక్తే లేదని, రాబోయే రోజుల్లో కూడా ఈ ఆకస్మిక తనిఖీలు ముమ్మరంగా కొనసాగుతాయని, నిబంధనలు అతిక్రమిస్తే వాహనాలను సీజ్ చేయడంతో పాటు యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయడానికి కూడా వెనుకాడబోమని ఆయన హెచ్చరించారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను స్కూల్ బస్సుల్లో ఎక్కించే ముందు వాహనాల కండిషన్‌ను గమనించాలని కోరారు. ఈ విస్తృత తనిఖీ డ్రైవ్‌లో జిల్లా రవాణా అధికారి ఎం. వెంకన్నతో పాటు అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు (ఏ ఎం వి ఐ) ఫహీమా సుల్తానా, సుందర్‌లాల్, రవాణా శాఖ ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆరోగ్య కార్యక్రమాలను అన్ని శాఖల సమన్వయంతో విజయవంతం చేయాలి

### :రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్



తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఉన్నత స్థాయి జిల్లా సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. పల్స్ పోలియో, జాతీయ నులిపురుగుల నిర్మూలన, డయేరియా నివారణ, పొగాకు నియంత్రణ, వర్షాకాల సీజనల్ వ్యాధుల నిరోధక చర్యలపై నిర్వహించిన ఈ సమావేశానికి రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో వైద్యారోగ్య శాఖ నేతృత్వంలో చేపట్టబోయే ప్రతిష్టాత్మక ఆరోగ్య కార్యక్రమాలను అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని సూచించారు. జిల్లాలో 0 నుండి 5 సంవత్సరాల లోపు వయస్సున్న మొత్తం 34,728 మంది చిన్నారులను గుర్తించామని, వారికి జూన్ 28వ తేదీ ఆదివారం నాడు పల్స్ పోలియో చుక్కల కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆ రోజున అనివార్య కారణాల వల్ల పోలియో చుక్కలు వేయించుకోలేకపోయిన చిన్నారులను గుర్తించేందుకు జూన్ 29, 30 తేదీలలో వైద్య సిబ్బంది నేరుగా ఇంటింటికీ వెళ్లి చుక్కలు వేసేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని జూలై 13న జిల్లాలోని 1 నుండి 19 సంవత్సరాల వయస్సు గల 70,773 మందిని గుర్తించి నులిపురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్రలు వేయనున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ విడతలో మిగిలిపోయిన పిల్లల కోసం జూలై 20న ప్రత్యేకంగా 'మాపప్ డే' నిర్వహించి మాత్రలు వేస్తారన్నారు. నులిపురుగుల వల్ల పిల్లల్లో అనీమియా (రక్తహీనత) వ్యాప్తి చెంది, వారు తీవ్ర అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందని, అందుకే సర్వరోగ నివారణకు ఈ మాత్రలు ఎంతో అవసరమని స్పష్టం చేశారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు, అంగన్‌వాడీ చిన్నారులకు వైద్య సిబ్బంది పర్యవేక్షణలోనే ఈ మాత్రలు అందజేయాలన్నారు. 'స్టాప్ డయేరియా క్యాంపెయిన్'లో భాగంగా జూన్ 16 నుండి జూలై 31 వరకు జిల్లా వ్యాప్తంగా డయేరియా (అతిసార) నివారణ ప్రచార కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. వర్షాకాలం ప్రారంభమైనందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు తగు జాగ్రత్తలు పాటించేలా విస్తృత అవగాహన కల్పించాలన్నారు. దోమల కాటు వల్ల మలేరియా, డెంగీ వంటి ప్రాణాంతక వ్యాధులు వస్తాయని, అందుకే నీరు నిల్వ ఉండకుండా ప్రతి కుటుంబం ప్రతి శుక్రవారం తప్పనిసరిగా 'డ్రై డే' పాటించేలా మున్సిపల్, పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. దోమల నివారణకు మురుగునీటి ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేయాలని, ధీమోపాస్ ద్రావణం చల్లాలని సూచించారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ, ఆహారం తినే ముందు చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని, పొగాకు వినియోగాన్ని పూర్తిగా మానేయాలని పిలుపునిచ్చారు. ఈ ఉన్నత స్థాయి సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా రెవెన్యూ అధికారి వసంత కుమారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మధుసూదన్, భూపాలపల్లి ఆర్డీఓ హరికృష్ణ, జిల్లా పంచాయతీ అధికారి శ్రీలత, ఇంటర్మీడియట్ విద్యాధికారి వెంకన్న, మున్సిపల్ కమిషనర్లు, సంక్షేమ శాఖల అధికారులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ప్రజావాణి అర్జీలను నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరించాలి

## అధికారులకు రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ ఆదేశం

**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ కార్యాలయ పల్స్ హాల్‌లో సోమవారం అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో కలిసి నిర్వహించిన 'ప్రజావాణి' (ప్రజల ఫిర్యాదుల విభాగం) కార్యక్రమంలో జిల్లాలోని వివిధ దూర ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి మొత్తం 66 దరఖాస్తులను స్వీకరించినట్లు జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ తెలిపారు. ప్రజల నుండి అందిన ఈ సమస్యల దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించడానికి ఆయా శాఖల అధికారులకు తక్షణమే ఎండార్స్‌మెంట్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ మాట్లాడుతూ.. తమ సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజలు ఎంతో ఆశతో సమర్పించిన దరఖాస్తులను అధికారులు ఎలాంటి జాప్యం చేయకుండా సత్వర పరిష్కారానికి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు వ్యక్తిగతంగా, క్షేత్రస్థాయిలో పరిశీలించి న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఈ వారం అందిన ప్రతి అర్జీని వచ్చే సోమవారం ప్రజావాణి సమయానికల్లా ఖచ్చితంగా పరిష్కరించి నివేదిక సమర్పించాలని స్పష్టం చేశారు.ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రజావాణికి అందిన ప్రతి ఒక్క దరఖాస్తును తప్పనిసరిగా అధికారిక ఆన్‌లైన్ ప్రజావాణి పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు.



అర్జీ సమర్పించిన వెంటనే దరఖాస్తుదారునికి కంప్యూటర్ జనరేటెడ్ రశీదు అందజేయాలని, తద్వారా సమస్యల పరిష్కార ప్రక్రియలో పూర్తి పారదర్శకత నెలకొల్పాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా, సదరు దరఖాస్తుల పరిష్కారానికి సంబంధించి ఆయా శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో తీసుకున్న చర్యల పూర్తి వివరాలను కూడా ఎప్పటికప్పుడు పోర్టల్‌లో ఆన్‌లైన్ ద్వారా అప్‌డేట్ చేయాలని స్పష్టం చేశారు.ప్రజావాణి ద్వారా అందిన ప్రతి వినతిని అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశంగా గుర్తించి,ప్రభుత్వం నిర్దేశించిన నిర్దిష్ట కాలవ్యవధిలోనే పరిష్కరించేలా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. బాధితుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించినా లేదా అనవసరంగా కాలయాపన చేసినా సంబంధిత అధికారులపై శాఖాపరమైన కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. ఈ ఉన్నత స్థాయి ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా రెవెన్యూ అధికారి వసంత కుమారి,భూపాలపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి హరికృష్ణ, కలెక్టరేట్ పరిపాలనాధికారి,జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు, ప్రజావాణి విభాగపు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అదనపు కట్నం వేధింపులతో

# యువతి ఆత్మహత్యాయత్నం

## ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి

**తెలుగు గళం న్యూస్ హన్మకొండ, జూన్ 15**

కట్నం వేధింపులను తట్టుకోలేక యువతి ఆత్మహత్యాయత్నం చేసి, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన విషాద ఘటన వెలుగులోకి వచ్చింది.పోలీసుల వివరాల ప్రకారం, హుస్నాబాద్ గ్రామానికి చెందిన కంసాని రాజమల్లు (48) తన కుమార్తె ముస్కు ప్రవళిక (26)ను సిద్ధాపురం గ్రామానికి చెందిన ముస్కు శ్రీకాంత్‌కు వివాహం చేశారు. వివాహ సమయంలో రూ.5 లక్షల నగదు, బంగారం కట్నంగా ఇచ్చినప్పటికీ, అదనపు కట్నం తీసుకురావాలని భర్త శ్రీకాంత్, అత్త ముస్కు సీత, ఆడపడుచులు ముస్కు రజని తదితరులు వేధింపులకు గురి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.ఈ వేధింపులను భరించలేక ప్రవళిక ఈ నెల 11న ఎలుకల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా, అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హన్మకొండలోని రోహిణి ఆస్పత్రికి తరలించారు.అయితే చికిత్స పొందుతూ సోమవారం (జూన్ 15) ఉదయం 7:30 గంటలకు ప్రవళిక మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు.ఈ ఘటనపై మృతురాలి తండ్రి కంసాని రాజమల్లు హసన్‌పర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, భర్త ముస్కు శ్రీకాంత్, అత్త ముస్కు సీత, ఆడపడుచులు ముస్కు రజనితో పాటు మరో మహిళపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.ఈ కేసును హసన్‌పర్తి ఎస్సై పి. గోవర్ధన్ నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# రామగుండాలపల్లిలో పునఃప్రారంభమైన ప్రభుత్వ పాఠశాల

## విద్యాశాఖ అధికారుల చేతుల మీదుగా వేడుకగా అక్షరాభ్యాసం.. విద్యార్థులకు ఉచితంగా బ్యాగులు,బుక్స్ పంపిణీ

**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి కొత్తపల్లిగోరి**

"విద్య అభివృద్ధి చెందితేనే.. గ్రామం అభివృద్ధి చెందుతుంది" అనే ఆశయంతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కొత్తపల్లిగోరి మండల పరిధిలోని రామగుండాలపల్లి గ్రామంలో మూతపడిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల సోమవారం తిరిగి పునఃప్రారంభమైంది.గతంలో విద్యార్థుల సంఖ్య లేక మూతపడిన ఈ పాఠశాలను, అదే గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త, యువ నాయకుడు జూపాక మహేష్ ప్రత్యేక చొరవ, నిరంతర కృషితో అధికారులు పునఃప్రారంభించేలా చేశారు.ఈ నూతన విద్యా సంవత్సరం ప్రారంభోత్సవ వేడుకలకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా విద్యాశాఖ అధికారి (డి ఈ ఓ) రాంజెందర్, గోరికొత్తపల్లి



మండల విద్యాశాఖ అధికారి (ఎం ఈ ఓ) రాజు ముఖ్య అతిథులుగా విచ్చేసి పాఠశాలను అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయికి దీటుగా నాణ్యమైన విద్య అందుతుందని,ఉచిత పుస్తకాలు, యూనిఫామ్‌లు ప్రభుత్వం అందజేస్తోందని తెలిపారు.గ్రామాల్లో ఉన్న నిరుపేద విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పేందుకు ప్రతి ఒక్కరూ ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలని, మూతపడిన బడిని తిరిగి తెరిపించేందుకు చొరవ చూపిన జూపాక మహేష్‌ను, గ్రామస్తులను అధికారులు ప్రత్యేకంగా అభినందించారు.పాఠశాల పునఃప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని గ్రామానికి చెందిన పలువురు దాతలు,యువకులు ముందుకు వచ్చి పాఠశాలలో చేరిన నూతన విద్యార్థులకు చదువుకు అవసరమైన స్టేషనరీ కిట్లు, స్కూల్ బ్యాగ్‌లు, నోట్ బుక్స్, పెన్నులు, వాటర్ బాటిల్స్‌ను ఉచితంగా అందజేసి వారి ఉదారతను చాటుకున్నారు. అనంతరం బడిని పునఃప్రారంభించడానికి పూర్తి సహకారం అందించిన జిల్లా,మండల విద్యాశాఖ అధికారులకు, పాఠశాల పునఃప్రారంభానికి తోడ్పడిన గ్రామ పంచాయతీ పాలకవర్గానికి, స్థానిక ప్రజలకు, ఉత్సాహంగా పాల్గొన్న యువతకు జూపాక మహేష్ సభాముఖంగా ప్రత్యేక కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేశారు. గ్రామంలోని ప్రతి బిడ్డకూ అక్షర జ్ఞానం అందించడమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ ఘనమైన విద్యా ఉత్సవ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఏడేల్లి మోహన్ రెడ్డి,పాఠశాల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయ బృందం, స్థానిక వార్డు సభ్యులు, విద్యా కమిటీ చైర్మన్, గ్రామ పెద్దలు, యువకులు,మహిళలు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని పాఠశాల ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేశారు.

# నీరుకుల్లాలో 'తెలంగాణ పబ్లిక్ స్కూల్' ఏర్పాటు చేయాలి

## -- మూడు గ్రామాల సర్పంచులు, ప్రజల ఏకగ్రీవ తీర్మానం

**తెలుగు గళం ఆత్మకూరు/ జూన్ 15:**



ఆత్మకూరు మండలం నీరుకుల్లా గ్రామంలో 'తెలంగాణ పబ్లిక్ స్కూల్'ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ కేశవాపూర్, నీరుకుల్లా, పెంచికలపేట గ్రామాల సర్పంచులు, వార్డు సభ్యులు, ప్రజలు, విద్యార్థులు మరియు పూర్వ విద్యార్థులు ఏకగ్రీవంగా తీర్మానించారు. సోమవారం నీరుకుల్లా గ్రామంలోని రైతు వేదిక వద్ద మూడు గ్రామాల ప్రజాప్రతినిధులు, ప్రజలతో కలిసి సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా మూడు గ్రామాల పాలకమండలి సభ్యులు, మేధావులు, రైతులు మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య అందాలంటే నీరుకుల్లా గ్రామంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయడం ఎంతైనా అవసరమని పేర్కొన్నారు. ఈ ప్రాంత విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, అందరం కలిసికట్టుగా ప్రభుత్వ పెద్దలకు, విద్యాశాఖ అధికారులకు విన్నవించనున్నట్లు తెలిపారు.

# ఉమ్మడి ఓబులాపూర్ గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే కడియం శ్రీహరికి వినతి



## ఇందిరమ్మ ఇళ్లు, రోడ్లు, పీహెచ్‌సీ ఏర్పాటు కోరిన గ్రామ ప్రతినిధులు

**తెలుగు గళం న్యూస్ జఫర్‌గడ్, జూన్ 15**

ఉమ్మడి ఓబులాపూర్ గ్రామ అభివృద్ధి కోసం పలు కీలక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామ ప్రజాప్రతినిధులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు సోమవారం స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ కార్యక్రమంలో జఫర్‌గడ్ పీఏసీఎస్ చైర్మన్ తీగల కరుణాకర్ రావు, ఓబులాపూర్ సర్పంచ్ దొంతమల్ల సంతోష్, ఇందిరమ్మ కమిటీ చైర్మన్ గార్లపాటి నీరజ రెడ్డి, పెద్ద తండా సర్పంచ్ బానోత్ లక్పతి తదితరులు పాల్గొన్నారు.గ్రామాభివృద్ధికి సంబంధించిన పలు ప్రధాన అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలో అధిక సంఖ్యలో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని, తిమ్మాపూర్ 'ఎక్స్' రోడ్ నుంచి చెరువు కట్ట మీదుగా ఓబులాపూర్--రామారం వరకు నూతన రహదారి నిర్మించాలని కోరారు. అలాగే చిన్న తండా క్రాస్ నుంచి గ్రామంలోకి వెడల్పుకు అనుగుణంగా సీసీ రోడ్డు నిర్మాణం, ఓబులాపూర్‌లో అసంపూర్తిగా ఉన్న సీసీ రోడ్ల పనులను పూర్తి చేయాలని విన్నవించారు.గ్రామ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఓబులాపూర్‌లో కొత్త ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని కూడా



అభ్యర్థించారు.

గ్రామ ప్రతినిధులు సమర్పించిన వినతిపత్రంపై ఎమ్మెల్యే కడియం శ్రీహరి సానుకూలంగా స్పందించి, గ్రామాభివృద్ధికి అవసరమైన పనులను పరిశీలించి త్వరలోనే అమలుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామశాఖ అధ్యక్షులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువజన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఏఎంసి ఉద్యోగి పదవి విరమణ



**రావులపాలెం(తెలుగు గళం) జూన్ 15 :** కొత్తపేట అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ యార్డులో యార్డ్ అసిస్టెంట్ గా పనిచేసిన యార్లగడ్డ సత్యనారాయణ పదవి విరమణ పొందిన సందర్భంగా ఆఫీసు స్టాంపు సిబ్బంది ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం చేపట్టారు. ముఖ్య అతిథులుగా మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లి మంగాదేవి, భీమారావు వైస్ చైర్మన్ కంఠంశెట్టి శ్రీనివాసరావు లు పాల్గొన్నారు.యార్లగడ్డ సత్యనారాయణ 28 సంవత్సరాలుగా మార్కెట్ యార్డులో పనిచేస్తూ అనేక సేవలందించారని ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను మెచ్చుకున్నారు.మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లి మంగాదేవి భీమారావు వైస్ చైర్మన్ కంఠం శెట్టి శ్రీనివాసరావు లు యార్లగడ్డ సత్యనారాయణను అభినందిస్తూ శాలువ కప్పి సత్కరించారు.

# 15లో 11 డిఎస్సీలు టీడీపీలో తీసినవే




## రద్దు చేసేందుకు అవి వాలంటరీ ఉద్యోగాలు కావు టీడీపీ నేతలు వెల్లడి!

**కాకినాడ, (తెలుగు గళం) జూన్ 15:** ఇప్పటివరకు టీచర్ల నియామకం కోసం నిర్వహించిన డీఎస్సీ పరీక్షల ఎంపికలలో 11 తమ టీడీపీ ప్రభుత్వ హయాంలో తీసినవేనని టీడీపీ నాయకులు వెల్లడించారు. ఎంతోకాలం కష్ట పడి చదివి టీచర్ ఉద్యోగాలు పొందిన వారిని రద్దు చేయిస్తానని వైసీపీ నేతలు చెప్పడం వారి అవివేకతనానికి నిదర్శమని వారు పేర్కొన్నారు. సోమవారం కాకినాడలోని గోదావరి కళాక్షేత్రంలో 2025 డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులతో పట్టభద్రుల ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో రాజశేఖర్ మాట్లాడుతూ తమ కూటమి ప్రభుత్వం డీఎస్సీని నిష్పక్షపాతంగా నిర్వహించిందన్నారు. ఉద్యోగాలు పొంది సుమారు 6 నెలలు దాటినా ఇప్పుడు వైసీపీ వారు అందులో అక్రమాలు జరిగాయని పేర్కొనడం పట్ల వారి అవివేకం బయటపడిందన్నారు. వైసీపీకి చెందిన మరి కొందరైతే డిఎస్సీ రద్దు చేస్తామని చెప్పి ఎంపికైన ఉపాధ్యాయులలో భయాందోళనలు సృష్టిస్తున్నట్లు పేర్కొన్నారు. వారు ఆరుగాలం కష్టపడి చదివి ఉద్యోగం సాధించారని వారు ఏ ప్రభుత్వ దయ దక్షిణాల మీద ఆధారపడలేదన్నారు. తీసి పడేయడానికి వారు చేస్తున్నవి వాలంటీర్ ఉద్యోగాలు కాదని రాజశేఖరం ఎద్దేవ చేశారు. ఇకనుంచి ప్రతి ఏడాది డీఎస్సీ, గ్రూప్ స్థాయి వంటి ఉద్యోగాలకు నియమాకం జరుగుతుందని పేరాబత్తుల చెప్పారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు)మాట్లాడుతూ డీఎస్సీలో అక్రమాలు జరిగాయని వైసీపీ వాళ్ళు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. అక్రమాలు, అవ్వకతవకలపై విద్యాశాఖ కార్యదర్శి ఆధారాలు చూపించాలని కోరినా వారు అందుకు వెనుదిరిగిన సంఘటనను గుర్తు చేశారు. నాడు బి నేడు పేరుతో వైసీపీ గోడలకు రంగులు, సున్నాలు మాత్రమే వేసిందని టీచర్ ఉద్యోగాలు భర్తీ చేయలేదని చెప్పారు. వైసీపీ చేస్తున్న కుట్రలను తిప్పి వనమాడి ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. అంతకుముందు డీఎస్సీలో ఉపాధ్యాయులు ఎంపికైన వారి అనుభవాలు, కష్టపడిన తీరులను సభకు వివరించారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్ రవి, పిఆర్టియు జిల్లా అధ్యక్షుడు సిహెచ్ ప్రదీప్ కుమార్, ఎస్టియు జిల్లా అధ్యక్షుడు ఎన్ సత్యనారాయణ, నోబెల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వి సూరిబాబు, సిపిఎస్ రాష్ట్ర ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎం రవికుమార్, పిఈటి అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కడపలో రౌడీ షీటర్లపై ఉక్కుపాదం




**కడపజిల్లా (తెలుగు గళం)జూన్ 15:**రౌడీ షీటర్లు నేర ప్రవృత్తి మానుకోకపోతే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ట్రబుల్ మాంగర్లు,గతంలో నేరాలకు పాల్పడిన వారి కదలికలపై నిరంతరం ప్రత్యేక నిఘా ఉంచాలని,మట్కా, క్రికెట్ బెట్టింగ్,గ్యాంబ్లింగ్ తదితర అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా కఠిన చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐపిఎస్ పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో కడప సబ్ – డివిజన్ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈసందర్భంగా జిల్లా ఎస్పి మాట్లాడుతూ. గ్రామసభలు, పల్లెనిద్ర, గ్రామాల సందర్శన తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు.అసాంఘిక కార్యకలాపాలైన మట్కా, క్రికెట్ బెట్టింగ్,గ్యాంబ్లింగ్ జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. భూ వివాదాలు,ఆర్థిక పరమైన అంశాల వలన క్రిమినల్ కేసులు నమోదైన ఎడల వాటిని క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారుల మరియు లీగల్ ప్రొసీజర్ మేరకు కేసు విచారణ త్వరితగతిన నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయాలన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక పిజిఆర్ఎస్ కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించి నిర్ణీత వ్యవధిలోగా చట్టపరిధిలో సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. డ్రోన్ కెమెరాల ద్వారా గంజాయి,ఇతర మత్తు పదార్థాలు,బహిరంగ మద్యపానం చేసే వారిపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయాలని ఆదేశించారు.

Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.